సాక్షి
విశాఖపట్నం
బుధవారం ı 4 ı డిసెంబర్ ı 2024


వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి వేషధారణలో..

విభిన్నం.. ప్రతిభ అపారం


దేవతామూర్తుల వేషధారణలో విభిన్న ప్రతిభావంతులు



వైకల్యాన్ని అధిగమించి.. ఆత్మవిశ్వాసంతో తమ విధి రాతను తామే రాసుకున్న విభిన్న ప్రతిభావంతులు అందరినీ ఆశ్చర్యపరిచారు. సామాన్యులకు ఏమాత్రం తీసిపోని విధంగా తమ ప్రతిభను ప్రదర్శించి ఔరా అనిపించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు వివిధ వేషధారణల్లో చేసిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఆటలు, పాటలతో వారు చేసిన సందడిలో కలెక్టర్, సీనియర్ సివిల్ జడ్జితో పాటు జిల్లా అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన 532 మందికి కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


లెవెన్ సెల్సీ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన


పురాణ ఘట్టం


ఆకట్టుకున్న జానపద నృత్యం


కాంతార గెటప్‌లో...

8లో

ఫ్లాప్ షో

బాంబుల మోత వినిపించదు
నౌకల సందడి కనిపించదు
యుద్ధ విమానాల హోరు ఉండదు

ఈ ఏడాది విశాఖకు దూరంగా నేవీ డే వేడుకలు

- కదన రంగ విన్యాసాలకు దూరమైన నగరవాసులు
- తొలిసారిగా విశాఖలో కాకుండా ఒడిశాలోని పూరీలో నిర్వహణ
- నేడు కేవలం విక్టరీ ఎట్ సీ వద్ద అమరవీరులకు శ్రద్ధాంజలి




నేవీడే నాడు విశాఖ తీరంలో గతంలో జరిగిన యుద్ధ విన్యాసాలు




బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ

విశాఖ సిటీ : గగనతలంలో యుద్ధ విమానాల హోరు ఉండదు. సముద్రంలో నావికాదళ నౌకల సందడి కనిపించదు. తీరం వెంబడి బాంబుల మోత వినిపించదు. ప్యారాచ్యూట్ ప్రదర్శనలు.. ఇసుక తిన్నెల్లో ట్యాంకర్ల వరుగులు.. శత్రు స్థావరాలపై విరుచుకుపడే మెరైన్ కమాండోలు.. ఇలా కదన రంగాన్ని తలపించే కళ్లు చెదిరే ప్రదర్శనలు.. ఈ ఏడాది జ్ఞాపకాలు గానే మిగిలిపోనున్నాయి. భూమి, ఆకాశం, సముద్ర జలాల్లో ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు తిలకించే అవకాశం నగర వాసులకు ఈ ఏడాది లేకుండా పోయింది. ఐదు దశాబ్దాలకు పైగా బీచ్ రోడ్డులో జరుగుతున్న నేవీ డే వేడుకలు ఈసారి విశాఖకు దూరమయ్యాయి. ఈ ఏడాది నేవీ డేను ఒడిశా రాష్ట్రంలోని పూరీలో నిర్వహించాలని భారత నౌకాదళం నిర్ణయించింది. దీంతో ఏటా డిసెంబర్ 4వ తేదీన జనసంద్రంతో కళకళలాడే సాగరతీరం ఇప్పుడు బోసిపోనుంది. అయితే నేవీ డే వేడుకలు దూరమైనప్పటికీ జనవరి 4వ తేదీన విశాఖ సాగర తీరంలో అదే తరహాలో విన్యాసాలు నిర్వహించాలని తూర్పు నావికాదళ అధికారులు నిర్ణయించారు.

ఐదు దశాబ్దాలకు పైగా..

1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత నౌకాదళం ప్రదర్శించిన సాంకేతిక ప్రతిభా పాటవాలు, వ్యూహాలు, ధైర్యసాహసాలకు గుర్తుగా ఏటా డిసెంబర్ 4వ తేదీన భారత నౌకాదళ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఆ రోజున తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో సాగర తీరంలో భారత నౌకాదళ సామర్థ్యాలను ప్రదర్శించేవారు. ఐదు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలు ఈ ఏడాది మనకు కనిపించవు. ఇన్నాళ్లలో కేవలం రెండుసార్లు మాత్రమే ఈ వేడుకలను రద్దు చేశారు. 2012లో మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ మరణించిన సమయంలోను, 2020లో కోవిడ్ కారణంగా వేడుకలను నిర్వహించలేదు.

కళతప్పిన సాగరతీరం

ఏటా నవంబర్ మూడో వారం నుంచి విశాఖ సాగర తీరంలో నేవీ డే సందడి కనిపించేది. రెండు వారాలు ముందుగానే యుద్ధ విన్యాసాలు, నౌకలు విశాఖ సాగర జలాల్లో దర్శనమిచ్చేవి. కానీ ఈసారి నేవీ డే వేదిక పూరీకి మారడంతో ఇక్కడ సందడే లేకుండా పోయింది. నేవీ డే ముందు నిర్వహించే రిహార్సల్‌ను తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు, పర్యాటకులు విశాఖ సాగర తీరానికి వస్తుండేవారు. ఈసారి అటువంటి పరిస్థితి లేదు.

తొలిసారి పూరీలో..

ఏటా విశాఖలో నిర్వహిస్తూ వచ్చిన నేవీ డే వేడుకలు తొలిసారిగా పూరీలో నిర్వహించాలని భారత నావికాదళం నిర్ణయించింది. ఒడిశా కూడా తూర్పు నావికాదళం పరిధిలోనే ఉంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సొంత రాష్ట్రం కావడంతో ఆమె అక్కడి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. తూర్పు నావికాదళానికి చెందిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, హెలీకాప్టర్లు అన్నీ గత నెలలోనే ఒడిశా రాష్ట్రానికి చేరుకున్నాయి. అయితే బుధవారం విశాఖ బీచ్ రోడ్డులో ఉన్న విక్టరీ ఎట్ సీ స్థూపం వద్ద నావికాదళ అధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు.

జనవరి 4న విన్యాసాలు

ఈసారి నేవీ డే వేడుకలకు విశాఖ దూరమైనప్పటికీ.. తూర్పు నావికాదళ విన్యాసాలు మాత్రం నెల రోజుల తరువాత విశాఖవాసులకు కనువిందు చేయనున్నాయి. వచ్చే ఏడాది జనవరి 4వ తేదీన విశాఖ సాగర తీరంలో అదే తరహాలో ప్రదర్శనలు చేయాలని ఈఎన్‌సీ అధికారులు నిర్ణయించారు. నేవీ డే స్థాయిలో వేడుకలు జరగనప్పటికీ.. యుద్ధ నౌకల నుంచి బాంబుల మోతలు.. గగనతలంలో యుద్ధ విమానాల చక్కర్లు.. తీరం వెంబడి బాంబుల మోతలు.. ఇలా నావికాదళ యుద్ధ విన్యాసాలను వీక్షించే అదృష్టం కలగనుంది.

చదువుల సామర్థ్యమెంత?

- నేడు 'పరఖ్ సర్వేక్షణ్' పరీక్ష
- జిల్లాలో 111 పాఠశాలలు ఎంపిక
- 3,6,9 తరగతుల విద్యార్థులకు ప్రత్యేకం


పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో చదువుల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్' పేరిట బుధవారం నిర్వహించనున్న ప్రత్యేక పరీక్షకు అంతా సిద్ధమైంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో ఎంపిక చేసిన 111 పాఠశాలల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఆయా స్కూళ్లలో 145 తరగతి గదుల్లో 3, 6, 9వ తరగతుల విద్యార్థులతో పరీక్ష రాయించనున్నారు. పాఠశాలల్లో ప్రస్తుతం సాగిస్తున్న విద్యాబోధనతో విద్యార్థుల సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయనేది దీని ద్వారా అంచనా వేయనున్నారు. గతంలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) పేరిట దీన్ని నిర్వహించేవారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను బేరీజు వేయడం ద్వారా భవిష్యత్‌లో విద్యా కార్యక్రమాల అమలుకు దీన్ని ప్రాతిపదికగా తీసుకోనున్నారు. ప్రతీ నాలుగేళ్లకోసారి జాతీయ స్థాయిలో ఈ పరీక్షను నిర్వహిస్తుండటంతో జిల్లా విద్యాశాఖాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యాప్రమాణాలు ఎలా ఉన్నాయి? ప్రస్తుతం అమలు చేస్తున్న బోధనా పద్ధతుల వల్ల విద్యార్థులకు ఏ మేరకు మేలు జరుగుతుందనేది తెలుసుకునేలా జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎన్‌సీఈఆర్‌టీ) ప్రశ్నా పత్రాలను రూపొందించింది. 3, 6, 9 తరగతులకు ఒక్కో తరగతి నుంచి 30 మంది విద్యార్థులను ఎంపిక చేసుకుని పరీక్ష నిర్వహించనున్నారు. వీటి నిర్వహణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. భీమునిపట్నం ప్రభుత్వ డైట్ కాలేజీ విద్యార్థులు, గాజువాకలోని ఓ ప్రైవేట్ కాలేజీకి చెందిన మొత్తం 145 మంది విద్యార్థులను ఈ సర్వేలో ఇన్విజిలేటర్లుగా వినియోగిస్తున్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎం పర్యవేక్షకులుగా, డీఈవో, సీబీఎస్‌ఈ పాఠశాలల నుంచి ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ జిల్లా కో–ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

ఏయూ విద్యార్థులకు 'కాగ్నిజెంట్' మెరిట్ స్కాలర్‌షిప్


విద్యార్థులకు నమూనా చెక్కును అందజేస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేసింది. మొత్తం పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.70 వేలు చొప్పున మొత్తం రూ.7లక్షల సహాయం చేసింది. ఈ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేసింది. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి స్కాలర్‌షిప్ అందించిన కాగ్నిజెంట్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ఏటా తమ విభాగంలోని విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. ఏయూ అలుమ్ని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ అలీ, డాక్టర్ మూర్తి, డాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు, కన్నీళ్లు.. నిత్యకృత్యం



కాలికి గాయమై నడవ లేని స్థితిలో ఉన్న తన కుమార్తెను శ్రీకాకుళానికి చెందిన పి.అప్పారావు కేజీహెచ్‌లో చేర్పించాడు. వైద్యులకు చూపించగా ఎక్స్‌రే కోసం రిఫర్ చేశారు. బాలిక నడిచే స్థితిలో లేదు. వీల్ చైర్ ఇవ్వడానికి సిబ్బంది నిరాకరించారు. వార్డు బాయ్స్ అందుబాటులో లేరు. మరో మార్గం లేక కుమార్తెను తండ్రి ఎత్తుకొని తీసుకెళ్లాడు. కేజీహెచ్‌లో రోగులకు ఈ తరహా కష్టాలు నిత్యకృత్యంగా మారాయి. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్,విశాఖపట్నం

మందుల కొరత.. రోగుల కలత

- సెంట్రల్ డ్రగ్ స్టోర్, కేజీహెచ్‌లో నిండుకున్న మందులు
- అత్యవసర మందుల కోసం రోగుల పాట్లు
- పేద రోగులను వెంటాడుతున్న మందుల కొరత




కేజీహెచ్‌లో మందులు ఇచ్చు కౌంటర్ల వద్ద రద్దీ

మంగళవారం ఉదయం 10 గంటలకు జ్వరం, వాంతులు ఎక్కువగా వస్తున్నాయని అక్కయ్యపాలేనికి చెందిన సుధాకర్ కేజీహెచ్‌కు వచ్చాడు. వైద్యుడికి చూపించగా మందులు రాశారు. చీటీ తీసుకుని మందులిచ్చే గదికి వెళ్తే రెండు రకాల మందులు ఇచ్చారు. మరో రెండు రకాల మందులను బయట తీసుకోవాల్సిందిగా చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరతతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.

మహారాణిపేట : ప్రజల ఆరోగ్యం కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను కల్పించకపోగా.. కనీసం మందుల సరఫరాపై కూడా దృష్టి సారించట్లేదు. దీంతో జిల్లాలో పెద్దాస్పత్రి కేజీహెచ్ నుంచి పీహెచ్‌సీల వరకు అన్నింటా మందుల కొరత వేధిస్తోంది. రోగులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తే.. కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

గతంలో నెల రోజులకు సరిపడా పంపిణీ

గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రికి వచ్చే రోగులందరికీ మెరుగైన వైద్య సేవలతోపాటు, నెలకు సరిపడా మందులు ఒకేసారి అందించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆస్పత్రుల్లో మందుల కొరత విపరీతంగా ఉంది. కేజీహెచ్‌తోపాటు ఇతర ఆస్పత్రుల్లో మందుల కోసం అడిగితే విజయవాడ నుంచే రావడం లేదని, ఇండెంట్ పెట్టామని చెబుతున్నారు. కేజీహెచ్‌కు ఉత్తరాంధ్రతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. గత ప్రభుత్వంలో వైద్యంతోపాటు అవసరమైన మందులన్నీ ఒకేసారి ఇచ్చేవారు. ఇప్పుడు అన్ని రకాల మందులు తక్కువగా ఉండడంతో వారం రోజులకు మాత్రమే ఇస్తున్నారు. ఇందులో కూడా కొన్ని రకాల మందులు స్టాక్ లేదంటున్నారు. ఈ మందుల కోసం మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు రాలేక.. దూర ప్రాంత రోగులు ప్రైవేట్ మందుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు.

బయట నుంచి తెచ్చుకోవడమే..

కేజీహెచ్‌లో గతంలో మొత్తం 1,500 రకాల మందులు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు అన్నీ కలిపి 300 రకాలు కూడా లేవని తెలుస్తోంది. ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో బయట మందులు కొనుగోలు చేసి తెచ్చుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఈ దుస్థితి కేజీహెచ్‌లోనే కాకుండా విమ్స్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్యశాల, ఈఎన్‌టీ ఆస్పత్రి, ఆర్‌సీడీ ఆస్పత్రి, టీబీ ఆస్పత్రుల్లోనూ నెలకొంది. దెబ్బలు తగిలిన వారికి డ్రెస్సింగ్ చేయడానికి అవసరమైన మందులు, సూదులు, బ్యాండేజ్ తదితర కిట్స్ కూడా అందుబాటులో లేవు. ఎవరికైనా డ్రెస్సింగ్ చేయాలంటే వారు బయట కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిందే.

కొరత ఉన్న మందులు

ఇన్సులిన్, ఫిట్స్, మూర్ఛ, అన్ని రకాల బ్లీడింగ్ నివారణకు వాడే మందులు, పలు రకాల యాంటీబయోటిక్స్, హిమోగ్లోబిన్ పెంచేవి, వెంటిలేటర్స్ కిట్స్, ఆక్సిజన్ పైప్‌లు, హృద్రోగ నివారణ మందుల కొరత ఎక్కువగా ఉంది. క్యాన్సర్ నివారణ మందుల్లో కొన్ని మాత్రమే ఉన్నాయి. కుట్లు వేసే సూదులు, కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్, తిమ్మిర్ల నియంత్రణ, రుతుక్రమం లోపాల నియంత్రణ, ఆపరేషన్ కుట్లు వేసే దారం, మలబద్ధకం, గాయాలు మానేందుకు వాడే మందులు, గర్భాశయ ఇన్ఫెక్షన్ల మందుల కొరత కూడా ఉంది.

మందులు నిల్.. కౌంటర్ల వద్ద రోగులు ఫుల్

కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అక్కడి వైద్యులు రాసిన అన్ని మందులు దొరకడం లేదు. గంటల తరబడి క్యూ లైన్‌లో ఉన్నా..కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన వాటి కోసం తర్వాత రండి అని చెప్తున్నారు. కేజీహెచ్‌లో రోజుకు 3వేలకు పైగా ఓపీలుంటాయి. ఇందులో చాలా మందికి వైద్యులు మందులు రాస్తున్నారు. కౌంటర్ల వద్ద బారులు తీరుతున్నా.. అవసరమైన మందులు ఇవ్వక పోవడంతో.. ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి, చేతిచమురు వదిలించుకుంటున్నారు.

బయట కొనుక్కోమన్నారు..



నాకు గుండె శస్త్ర చికిత్స జరిగింది. మందుల కోసం ఆస్పత్రికి ఉదయం 10 గంటలకు వచ్చాను. అప్పటి నుంచి మందులు ఇచ్చే గది వద్ద క్యూలో నిల్చున్నాను. డాక్టర్ రాసిన మందుల్లో 3 రకాలు మాత్రమే ఇచ్చారు. మిగిలిన మూడు రకాలు బయట కొనుక్కోమని చెప్పారు. ఈ మందులు తీసుకుని క్యూ నుంచి బయటకు వచ్చేసరికి మధ్యాహ్నం 12.20 గంటలయింది.

– లక్ష్మి, వెంకటేశ్వరనగర్, చోడవరం

అన్ని రకాల మందులు లేవు



మందుల కోసం ఉదయాన్నే వచ్చాం. నా భార్యకు బాగోలేకపోతే నేను క్యూలో ఉన్నాను. మందుల కౌంటర్ వద్ద జనాలు ఎక్కువగా ఉన్నారు. మందుల కోసం చీటీ ఇచ్చాను. ఇందులో అన్ని రకాల మందులు లేవని చెప్పి కొన్ని రకాల మందులే ఇచ్చారు. అవసరం అయితే బయట కొనుగోలు చేసుకోవాలని సలహా ఇచ్చారు. అవసరం లేకుండా డాక్టర్లు రాయరు కదా..!

– సత్తిరాజు, పూర్ణామార్కెట్

నాకవుట్‌కు విదర్భ

విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ డీ నుంచి విదర్భ 18 పాయింట్లతో నాకవుట్‌కు చేరింది. మంగళవారం జరిగిన పోటీల్లో చండీగఢ్‌పై రైల్వేస్ ఐదు వికెట్ల తేడాతో, అసోంపై ఒడిశా 63 పరుగుల తేడాతో విజయం సాధించాయి. వైఎస్సార్ స్టేడియంలో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా తొమ్మిది ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది. ఓపెనర్ స్వస్తిక్ సమాల్(68) అర్ధసెంచరీతో రాణించాడు. ప్రతిగా అసోం 8.1 ఓవర్లలోనే 57 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను తొమ్మిది ఓవర్లకు కుదించారు. డేనైట్‌గా జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చండీగఢ్ ఏడు వికెట్లకు 162 పరుగులు చేసింది. కీపర్ బ్యాటర్ పార్దీప్ (64) అర్ధసెంచరీ చేశాడు. ప్రతిగా రైల్వేస్ 18.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయతీరానికి చేరింది. కెప్టెన్ ఉపేంద్ర 52 పరుగులు చేశాడు.

వీఎంఆర్డీఏ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దండి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో వీఎంఆర్డీఏ కార్యాలయం పరిసర ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. కార్యాలయ ప్రాంగణాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో సీఎం సమావేశం నిర్వహించనున్నారని అధికారులకు తెలిపారు. ప్రాంగణం మొత్తం మరమ్మతులు, రహదారులు, బీటీ లేయర్, పెయింటింగ్ పనులను చేపట్టాలని ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో చెత్తను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్ తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మర్రిపాలెం: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులు మంగళవారం బిర్లా జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కంచరపాలెం నుంచి బిర్లా జంక్షన్ వైపు సర్వీస్ రోడ్డులో వస్తున్న ఆటోను గుర్తించి 20 బ్యాగ్‌ల్లో (990 కేజీలు) అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. గోపాలపట్నం కొత్తపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ అశోక్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలి గురువారం పూజకు ఏర్పాట్లు



అమ్మవారి ఆలయ మండపం



భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలు



దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 5న తొలి గురువారం పూజలకు ఆలయ అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభం కానున్నాయి. నగరంతో పాటు ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై దృష్టి సారించారు.

దర్శన క్యూలైన్లు ఇలా..

టౌన్‌కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూలైన్ల టికెట్లు అక్కడే ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం(వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌తో పాటు వైద్య శిబిరం ఉంటుంది. ఎక్కడికక్కడ తాగునీరు అందుబాటులో ఉంటుంది. టౌన్‌కొత్తరోడ్డు, ఘోషాసుపత్రి, అమ్మవారి ఆలయం వెనుక భాగంలో చెప్పుల స్టాండ్ ఉంటాయి. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా గట్టి బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగుల కోసం వీల్‌చైర్లు అందుబాటులో ఉంటాయి.

రోజూ మహాన్నదానం

మార్గశిర మాసోత్సవాలు పురస్కరించుకొని నెల రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ 2 వేల మందికి, ఉత్సవాలు చివరి రోజున 20 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టనున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

- బుధవారం అర్ధరాత్రి నుంచి ట్రాఫిక్ మళ్లించనున్నారు.
- జగదాంబ జంక్షన్ మీదుగా అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు సందు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం చేరుకుని అక్కడే వాహనాలు పార్కు చేసి కాలి నడకన అమ్మవారి గుడికి వెళ్లాలి.
- కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలు సీహార్స్ జంక్షన్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు పార్కింగ్ చేసుకుని కాలినడకన రావాలి.
- వన్‌టౌన్, ఓల్డ్ పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా అమ్మవారి గుడికి వచ్చే ద్విచక్ర వాహనదారులు లక్ష్మీటాకీస్, ఎంపీడీఎం హైస్కూల్ మీదుగా కురుపాం మార్కెట్ మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేసుకోవాలి.
- వన్‌టౌన్, ఓల్డ్ పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా వచ్చే నాలుగు చక్రాల వాహనదారులు కురుపాం మార్కెట్‌లో గల ఖాళీ స్థలంలో పార్కు చేసుకోవాలి.
- వీఐపీ టికెట్ హోల్డర్స్, రూ.500 టికెట్ తీసుకునే వారు బీచ్‌రోడ్డు మీదుగా టౌన్ హాల్ చేరుకుని అక్కడే తమ వాహనాలు పార్కు చేసుకోవాలి.
- దేవాలయ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న వారు తమ వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయరాదు.
- దేవాలయ పరిసర ప్రాంతాల వ్యాపారస్తులు రోడ్లపై ఎటువంటి వస్తువులు, వాహనాలు పెట్టరాదు.

సిరులతల్లికి లక్ష కుంకుమార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ప్రతి నెలా మొదటి మంగళవారం లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన కుంకుమార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతినెలా మొదటి మంగళవారం నిర్వహించే ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10వేలు చెల్లించినచో వారి తరఫున నలుగురు దంపతులను అనుమతించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూర్చుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కుంకుమార్చన చేస్తున్న వేద పండితులు

ఆరిపోయిన ఆశల దీపం

- బస్సు ఎక్కుతుండగా జారి పడిన డిప్లమో విద్యార్థి
- వెనక చక్రాల కింద పడి నలిగిన ప్రాణం
- కశింకోట మండలం తాళ్లపాలెం కూడలి ఘటన

కశింకోట/యలమంచిలి రూరల్: ఆశల దీపం ఆరిపోయింది. ఉన్నత విద్య అభ్యసించి కుటుంబానికి ఆసరాగా నిలుస్తాడని పడిన ఆశలు అడియాసలయ్యాయి. కళాశాల నుంచి ఇంటికి వెళ్లడం కోసం ఆర్టీసీ బస్సు ఎక్కుతూ కాలు జారి పడిన ఘటనలో యలమంచిలి మండలం పెద షేకిల్లపాలెం గ్రామానికి చెందిన అగ్రహారపు మణికంఠ(18) దుర్మరణం చెందాడు. కశింకోట మండలం తాళ్లపాలెం కూడలిలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యలమంచిలి మండలం షేకిల్లపాలెం గ్రామానికి చెందిన మణికంఠ మాకవరపాలెంలోని అవంతి కళాశాలలో డిప్లమో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రోజూ బస్సులో కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుతుంటాడు. ఎప్పటిలాగే వెళ్లిన మణికంఠ కళాశాల ముగియగానే సాయంత్రం మాకవరపాలెం నుంచి మండలంలోని తాళ్లపాలెం కూడలి వరకు బస్సు మీద వచ్చి దిగాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లడానికి అనకాపల్లి నుంచి పాయకరావుపేట వెళుతున్న పల్లె వెలుగు బస్సు ఎక్కబోయి జారి పడిపోవడంతో వెనక చక్రాలు ఆయన మీద నుంచి వెళ్లిపోయాయి. సుమారు 50 మీటర్ల దూరం వరకు బస్సు ఈడ్చుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మణికంఠ మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.





డిప్లమో విద్యార్థి మృతదేహం, మణికంఠ(ఫైల్)

పెద షేకిల్లపాలెంలో విషాదఛాయలు

మణికంఠ మృతితో పెద షేకిల్లపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన చిన్నం నాయుడు, శివలక్ష్మి దంపతులకు కుమారుడు మణికంఠ, కుమార్తె ఉన్నారు. మణికంఠ మాకవరపాలెం అవంతి కళాశాలలో డిప్లమో చదువుతున్నాడు. రోజూలాగే కాలేజీకి వెళ్లిన కుమారుడు ఇంటికొచ్చేస్తాడని ఎదురుచూస్తున్న ఆ తల్లిదండ్రులు పిడుగులాంటి వార్త వినడంతో కుప్పకూలిపోయారు. విగతజీవిగా మారిన కుమారుడ్ని చూసి తల్లడిల్లిపోయారు. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడన్న నిజం తెలియడంతో దేవుడా ఇక మాకు దిక్కెవరు, ఎవరి కోసం బతకాలంటూ అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీ వద్ద గుండెలవిసేలా రోదించడం అక్కడి వారిని కలచివేసింది.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

మురళీనగర్: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు కోర్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణతో పాటు సర్టిఫికెట్ అందిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

స్కిల్ హబ్ పేరు	నిర్వహిస్తున్న కోర్సు	ఫోన్ నంబర్
ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ, భీమిలి	అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్	95535 58191
ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కంచరపాలెం	డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ అసెంబ్లింగ్ టెక్నీషియన్	72870 69457
ప్రభుత్వ ఓల్డ్ ఐటీఐ, కంచరపాలెం	లైన్‌మన్ డిస్ట్రిబ్యూషన్ టెక్నీషియన్	85558 68681
ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి	అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్/ షీల్డ్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ వెల్డర్	9014766143
ప్రభుత్వ ఐటీఐ, గాజువాక	టెక్నికల్ ఎలక్ట్రీషియన్	8121743777
విశాఖ మహిళా డిగ్రీ కళాశాల, డాబాగార్డెన్స్	కోర్స్ ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్	91216 76360
డాక్టర్ వీఎస్ కృష్ణ డిగ్రీ కాలేజీ, మద్దిలపాలెం	ఆఫీస్ అసిస్టెంట్	98856 94676
ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రం, గాజువాక	అసిస్టెంట్ ప్లంబర్ జనరల్	94938 37994
ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రం, మహారాణిపేట	అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్	96761 70026

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిద్దాం



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

- వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- కలెక్టర్ హరేందిర ప్రసాద్ హామీ
- ఘనంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

బీచ్‌రోడ్డు: ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచే అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతుల నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, వారిని విశ్వవిజేతలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధ్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మతో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'సమగ్ర, స్థిరమైన భవిష్యత్ కోసం వికలాంగుల నాయకత్వాన్ని విస్తరించడం'అనే థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతులకు విశేషమైన శక్తులు ఉంటాయని, వారు చేస్తున్న పనులు, తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలే ఇందుకు నిదర్శనమన్నారు. వేదికపై పలువురు విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను చూసి మంత్రముగ్ధుడినైపోయానని, వారి ప్రతిభ అమోఘమని ప్రశంసించారు. వారికి తగిన చేయూత, ప్రోత్సాహం అందిస్తే మరింత ప్రతిభావంతులుగా తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం తరఫున ఇప్పటికే పలు శిబిరాలు నిర్వహించి పరికరాలు అందజేశామని.. భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తామన్నారు. త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ మాట్లాడుతూ వికలాంగుల చట్టం, హక్కుల గురించి విభిన్న ప్రతిభావంతులు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. వారి హక్కులకు చట్టబద్ధత ఉందని, వాటిని వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగం, ప్రభుత్వాలు వారికి కల్పించిన ప్రయోజనాలు పొందాలన్నారు. వారిని అన్నింటిలో ప్రాధాన్యం కల్పించాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్.. అలరించిన ప్రదర్శనలు

ఈ సందర్భంగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్‌లో విభిన్న ప్రతిభావంతులు ఏర్పాటు చేసిన వివిధ వస్తువుల స్టాళ్లను కలెక్టర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సందర్శించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన 532 మందికి కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. వివిధ సంస్థల్లో దివ్యాంగులకు సేవలందిస్తున్న వలంటీర్లను సత్కరించారు. అంతకుముందు పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహూతులను అలరించారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, డీఈవో ప్రేమ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సూపరింటెండెంట్ పద్మావతి, సమగ్ర శిక్ష అధికారులు, వివిధ విద్యా సంస్థల నిర్వాహకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం

జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డి

ఉక్కునగరం: రసాయన పరిశ్రమల్లో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని.. ఆయా యాజమాన్యాలు అధిక భద్రతా చర్యలు చేపట్టాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డి సూచించారు. ఫ్యాక్టరీ డిపార్ట్‌మెంట్, సొసైటీ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ సహకారంతో మంగళవారం ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో 'రసాయన పరిశ్రమల్లో భద్రత, అత్యవసర నిర్వహణ' అనే అంశంపై రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివశంకరరెడ్డి మాట్లాడుతూ విశాఖ రీజియన్‌లో దాదాపు 165 రసాయన పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో రెండు ఫ్యాక్టరీల్లో పెద్ద ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రమాదాలు జరగకుండా నివారించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫార్మాజెల్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అనంత్ బర్నడికర్ తన ప్రసంగంలో భద్రతపై విలువైన ఆలోచనలను పంచుకున్నారు. లారస్ ల్యాబ్స్‌కు చెందిన శ్రీనివాసరావు వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో విజయనగరం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.వి.సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబు, రాష్ట్రంలోని వివిధ కెమికల్ ఫ్యాక్టరీలకు చెందిన 270 మంది ప్రతినిధులు, పలువురు ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న జాయింట్ చీఫ్ ఇనస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డి

ఫుడ్ సేఫ్టీ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ఏళ్ల తరబడి ఒకే స్థానంలో ఉన్న ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ నందాజీ, అప్పారావులపై చర్యలు తీసుకోవాలని కృష్ణమూర్తి అనే వ్యక్తి కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీచ్‌రోడ్డులోని కామత్ హోటల్‌లో కుళ్లిన మాంసం విక్రయించారని ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే.. సదరు అధికారులు తమకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని అందులో పేర్కొన్నారు. నందాజీ ఆరేళ్లుగా, అప్పారావు పదేళ్లకు పైగా విశాఖలోనే తిష్ట వేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కలుషిత ఆహారం విక్రయిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను ప్రోత్సహిస్తున్నారన్నారు. కుళ్లిన మాంసం అమ్మిన కామత్ హోటల్‌పై, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు కృష్ణమూర్తి తెలిపారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కృష్ణమూర్తి

చెరువులవేనం వ్యూపాయింట్ మూసివేత

చింతపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో పర్యాటకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని చెరువులవేనం వ్యూపాయింట్‌ను తాత్కాలికంగా మూసివేసినట్టు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పర్యాటక సీజన్ కావడంతో వారాంతాల్లో దూర ప్రాంతాలనుంచి పర్యాటకులు వస్తున్నారన్నారు. చెరువులవేనం కొండపైకి వెళ్లే ప్రధాన రహదారి అసంపూర్తిగా ఉండటంతోపాటు కొండచరియలు విరిగిపడే అవకాశాలు ఉన్నాయన్నారు. అందువల్ల ఈ రహదారిని తాత్కాలికంగా మూసివేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బందిని పంపించి తాత్కాలికంగా రహదారిని మూసివేసినట్టు ఆయన పేర్కొన్నారు. అక్కడ ప్రధాన మార్గంలో తాత్కాలిక చెక్‌పోస్టును ఏర్పాటుచేసినట్టు తహసీల్దార్ తెలిపారు.



చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ సిబ్బంది

కొండంత పండగ



విశాఖపురి మేరీమాత

- 8న విశాఖపురి మేరీమాత పండగ
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- పెద్ద ఎత్తున ఉత్సవ ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: నగరంలోని పాత పోస్టాఫీస్ వద్ద గల కొండగుడి (రోజ్‌హిల్స్)పై కొలువుదీరి.. కులమతాలతో సంబంధం లేకుండా భక్తులంతా కొలిచే తల్లి అమలోద్భవి(విశాఖపురి మేరీమాత). రోస్‌హిల్స్‌పై వెలసిన మేరీ మాత పుణ్యక్షేత్రం విశాఖపురికి ప్రత్యేక ఆభరణం. దీనినే 'కొండగుడి'గా భక్తులు పిలుచుకుంటారు. ఏటా డిసెంబరు 8వ తేదీన జరిగే కొండగుడి పండగకు హిందూ, ముస్లిం, కథోలిక, కథోలికేతర క్రైస్తవులు అశేషంగా తరలివస్తారు. కొండమాత ఉత్సవాలు దాదాపు తొమ్మిది రోజుల పాటు సాగుతాయి. వీటిలో చివరి రోజున మాతను దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తారు. కాగా.. ఈ ఉత్సవాలు గత నెల 29వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీ ఆదివారం వరకు జపమాల, దివ్యపూజ, స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తారు. కొండగుడిపై వెలసిన అమలోద్భవి మాత పట్ల అపారమైన నమ్మకం గల భక్తులు ఇక్కడ తలనీలాలు సమర్పించుకుని, అమ్మ ముందు మోకరిల్లుతారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

8న జరిగే పూజలివే..

వేకువజాము 4.30 గంటలకు, తిరిగి 5.15, 6 గంటలకు ఆలయంలో ఆంగ్లంలో దివ్యపూజ, ఉదయం 5, 6 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ, 7.30 గంటలకు గుహ వద్ద తెలుగులో పొంటిఫికల్ దివ్యపూజాబలి నల్గొండ పీఠాధిపతి కరణం ధమన్‌కుమార్‌చే నిర్వహిస్తారు. ఉదయం 10, 11, 12 గంటలకు గుహ వద్ద నూతన గురువులచే తెలుగులో దివ్యపూజ చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు దివ్యసత్ప్రసాద ఆరాధన కార్యక్రమం, రాజమండ్రి విచరణ కర్త ఫాదర్ ఈగల రవీంద్రకుమార్‌చే దివ్య సత్ప్రసాద ఆరాధన ఏర్పాటు చేశారు. అనంతరం విశాఖపురి మేరీమాత ద్వైమాస పత్రిక బైబిల్ క్విజ్, బైబిల్ పదకేళిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారు. సాయంత్రం 5, 6 గంటలకు గుహ వద్ద తెలుగులో దివ్యపూజ జరపనున్నారు.

పెద్ద ఎత్తున ఉత్సవ ఏర్పాట్లు..

అమలోద్భవి మాత ఉత్సవం పురస్కరించుకుని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. భక్తులు ఆలయానికి సమర్పించే బంగారు, వెండి ఆభరణాలను ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ఉంచారు. పండగ రోజుల్లో భక్తులు వీటిని సందర్శించేందుకు అనుమతి కల్పించారు. ఉత్సవాలకు వచ్చేవారి సౌకర్యార్థం స్టాళ్ల ద్వారా తినుబండారాలతో పాటు ఆధ్యాత్మిక వస్తువులు, పుస్తకాలు ప్రదర్శించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి సెయింట్ ఎలాసిస్ పాఠశాలలో వసతి సౌకర్యం కల్పిస్తారు.



ప్రధాన ఆలయం

కొండగుడికి ఘన చరిత్ర

1850 దశకంలో జడ్జిగా పనిచేసిన ఆంగ్లేయుడు రోస్ ఉద్యోగ విరమణ చేసిన తర్వాత విశాఖలో నివసించేందుకు ఈ కొండను ఆనుకొని మంచి భవంతిని నిర్మించుకున్నాడు. భవంతి ఎదుట ఉన్న మర్రిచెట్టు కింద అల్పాహారానికి బల్లను ఏర్పాటు చేసుకుని, కూలీలను నియమించుకున్నాడు. తర్వాత కాలంలోనే ఆరోగ్యం క్షీణించడంతో ఇంగ్లాండ్‌కు తిరుగు పయనమయ్యాడు. ఈ భవంతిని కెప్టెన్ మాప్లెస్‌కు విక్రయించాడు. మాప్లెస్ తర్వాత భవంతి పలువురి చేతులు మారింది. 1867లో బిషప్ జాన్ మేరీ టిస్సో కొండపై కొంత భాగాన్ని కొనుగోలు చేసి శిథిలమైపోతున్న ఈ భవనాన్ని బాగుచేసి రంగులు వేశారు. పెను తుపానులకు తట్టుకుని కొండగుడి సురక్షితంగా నిలవడంతో అందరికి విశ్వాసం ఏర్పడి, 1876లో ప్రార్థనాలయాన్ని నిర్మించారు. 19వ శతాబ్దం వచ్చే సరికి కొండగుడి పుణ్యక్షేత్రంగా మారింది. తర్వాత ఒక్కొక్కటిగా లూర్దుమాత గుహ, యోసేపు ప్రార్థనామందిరం వంటివి నిర్మించారు. 1904లో పాత నిర్మాణాన్ని కూలదోసి 60 అడగుల పొడవు, 40 అడుగుల వెడల్పు, 32 అడుగుల ఎత్తులో ఆలయ నిర్మాణం జరిగింది. రెండో ప్రపంచ యుద్ధనంతరం కొండగుడికి ప్రత్యేక ప్రదక్షిణను నిర్వహించారు. 1973 నాటికి వాహనాలు కొండమీదకు చేరుకోవడానికి మట్టిదారి నిర్మించారు. 2004లో శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, GOWTHAM KRISHNA MANCHUKONDA S/O Manchukonda Yethiraja Subramanyam D.No. 49-20-2/a/1, Lalithanagar, Akkayyapalem, Vizag-16. My Daughter's name is MANCHUKONDA RIYA KRISHNA (Old Name). I have changed my Daughter's name as MANCHUKONDA RIYA KRISHNAN (New Name). Here after my Daughter's name is known as MANCHUKONDA RIYA KRISHNAN (New Name).

CHANGE OF NAME

I, GURUVUGARI KRISHNA KUMARI, D/o GURUVUGARI GANGADARA MAHANTHI, Dr. No 2-9-2, Sector 9 MVP colony, Visakhapatnam, 530017 have changed My name from GURUVUGARI KRISHNA KUMARI (old name) to MARKONDA PATNAIKUNI DEVI PRIYA (new name), hence after all my documents and correspondence will continue with my new name MARKONDA PATNAIKUNI DEVI PRIYA

CHANGE OF NAME

I, VETHIRAJA SUBRAMANYAM MANCHUKONDA (old Name) S/O Manchukonda Singariah, D. No. 49-20-2/a/1, Lalithanagar, Akkayyapalem, Vizag-16. I have changed my Name as MANCHUKONDA YETHIRAJA SUBRAMANYAM (New Name). Here after my name is known as MANCHUKONDA YETHIRAJA SUBRAMANYAM (New Name).

CHANGE OF NAME

I, TAMBABATHULA NAGAMANI, D/O. TAMBABATHULA PALESWARA RAO, 1-35,Sri Shirdi Sai Vidya Niketan School, Venkayyamma Peta, Kadiyapu Lanka, E.G. 533126 have changed My name from THAMBABATHULA NAGAMANI (old name) to TAMBABATHULA NAGAMANI (new name), hence after all my documents and correspondence will continue with my new name TAMBABATHULA NAGAMANI

CHANGE OF NAME

I, DATLA RAMA KRISHNA RAJU S/o. Late Srihari Raju Datla, Residing at Flat No. 502, 4th Floor, Sree venkata Sai Apartment, Tagarapuvalasa, Visakhapatnam-531162. AP. Have changed my name from DATLA RAMA KRUSHNAM RAJU (Old Name) to DATLA RAMA KRISHNA RAJU (New Name), hence forth I am being Called as DATLA RAMA KRISHNA RAJU (New Name) for all purposes.

Education

- Degree, PG, Diploma, B.Tech, MBA, MCA, Paramedical Courses Admissions with Pass Guarantee, Failed Students Can Apply. Ph: 79972 96796. [V- 12236]

Services

GOLD LOANS

- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted

- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253935]
- మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం: 12,000/-. సంప్ర॥ 95507 45296 [V- 6615]
- సెక్యూరిటీ గార్డులు (స్త్రీ/పురు.) కావలెను. టెంపరరీగా 30 రోజులు పనిచేయుటకు. జగదాంబ / గాజువాక / గోపాలపట్నం / అనకాపల్లి ఏరియాలకు. రోజుకి రూ. 500/- ఇవ్వబడును. సంప్ర : 81795 52684, 63007 25191 [V-3309]
- ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- 10th to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 9036993713 [G-9096]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com